క్లుప్తంగా

ఇన్‌స్పెక్టర్‌గా బాజీలాల్



ఎస్పీ నరసింహ కిషోర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ బాజీలాల్

కంబాలచెరువు: ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్ఎస్‌కే బాజీలాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

మంగారాణికి బెస్ట్ టీచర్ అవార్డు



మోటూరి మంగారాణి

కంబాలచెరువు: స్థానిక నాగరాజా నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణికి కాకినాడకు చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ '2024 బెస్ట్ టీచర్' అవార్డును ప్రకటించింది. తమ సంస్థ 7వ వార్షికోత్సవం సందర్భంగా 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎం.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బోధనలో ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ, మంగారాణి లెసన్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులకు ఆసక్తికరమైన తరగతి గది కృత్యాలను, పాఠాలను వీడియో రూపంలో అందజేస్తున్న మంగారాణిని ఈ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. కాకినాడ కల్పనా సెంటర్‌లోని సూర్య కళామందిర్‌లో శనివారం జరిగే కార్యక్రమంలో మంగారాణికి అవార్డును అందజేయనున్నట్టు సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంఏ అలీమ్ తెలిపారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దిలీప్ కృష్ణ

సీటీఆర్ఐ: కలెక్టర్ ఆదేశాల మేరకు 28వ డివిజన్‌లోని మంగళవారపుపేటలో శుక్రవారం ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. మెడికల్ అధికారి డాక్టర్ పి.దిలీప్ కృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుమారు వంద మందికి పైగా స్థానికుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారిలో చాలామంది జ్వరం, ఒంటి నొప్పులతో బాధపడుతున్నట్టు తెలిపారు. వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం డీవీ శ్రావణి, ఆశా వర్కర్ రామలక్ష్మి, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ పి.శాంతారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో శనివారం నగరంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ప్రకటించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకూ వీరభద్రపురం, ఇంకమ్ ట్యాక్స్ కార్యాలయం, కోరుకొండ రోడ్డు, ఆదెమ్మ దిబ్బ, హరిపురం, సుబ్బరాయపురం, లలిత నగర్ ఏరియాలలో అంతరాయం కలుగుతుందన్నారు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సాయి నగర్, ఏవీ అప్పారావురోడ్డు, సాయి నేతాజీ టవర్స్, బాలాజీ స్ట్రీట్, శారదా నగర్, షీలా నగర్, గోపాల్ నగర్ పుంత, శ్రీనివాస గార్డెన్స్, అద్దేపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

వైద్యశిబిరాలు

కడియం: మండలంలోని జేగురుపాడు -1, దుళ్ల -1 పరిధిలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామస్తులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. జేగురుపాడులో 36 మందిని పరీక్షించగా వారిలో నలుగురు, దుళ్లలో 46 మందికి ముగ్గురు జ్వరంతో ఉన్నట్టు గుర్తించారు. డాక్టర్లు ఎస్.నాగసాయిమౌర్య, జి.స్వరూప, ఆరోగ్య విస్తరణాధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: 35 చిన్నకథకాదు
సూర్యమినీ	: ఉత్సవం
సూర్యప్యాలెస్	: ఏఆర్ఎం
స్వామి	: సరిపోదా శనివారం
అశోక	: ఉత్సవం
శివజ్యోతి	: మత్తు వదలరా-2
అనుశ్రీ	: మత్తు వదలరా-2
రాజా	: మత్తు వదలరా-2
రంభ	: కళింగ, కమిటీ కుర్రోళ్లు
ఊర్వశి	: భలే ఉన్నాడే
మేనక	: 3
కుమారి	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ (గోట్)
అప్సర	: సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్ మహల్	: ఏఆర్ఎం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మత్తు వదలరా-2
కడియం	
వెంకటసూర్య	: మత్తు వదలరా-2

సరస్వతీ.. నమస్తుభ్యం..



సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు

ధవళేశ్వరం: గణపతి నవరాత్రుల సందర్భంగా రథం వీధిలో యడ్ల మహేష్, రథంవీధి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం రాత్రి సరస్వతి పూజను ఘనంగా నిర్వహించారు. సుమారు 200 మంది చిన్నారులు ఈ పూజలో పాల్గొన్నారు. వీరికి పుస్తకాలు, పెన్నులను అందజేశారు. అంతకు ముందు శివబాల కూచిపూడి కళానికేతన్ , శ్రీలలిత ఆధ్వర్యంలో భరత నాట్యం ప్రదర్శించారు. ఆ చిన్నారులకు సీఐ టి.గణేష్ మెమోంటోలు బహూకరించారు.

సిద్ధిలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చన

సీటీఆర్ఐ: స్థానిక నాళం భీమరాజు వీధిలోని సిద్ధిలక్ష్మీగణపతి ఆలయం వద్ద వినాయక నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా శుక్రవారం దాల్వా మురళి, లలిత దంపతుల



నృత్యం చేసిన చిన్నారికి మెమెంటో అందజేస్తున్న సీఐ గణేష్

ఆధ్వర్యంలో సిద్ధిలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చన వైభవంగా జరిగింది. సుమారు 3 వేల మంది



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా.. శనివారం ఉదయం 8 గంటలకు రమా సహిత వీర వెంకట సత్యనారాయణస్వామి వ్రతాలు, సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం, ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఉంజల్ సేవ, 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఊరేగింపు, నిమజ్జనం జరుగుతాయి. అనంతరం ఈ నెల 22వ తేదీన భారీ అన్నసమారాధన నిర్వహిస్తారు.

నందిగామలో న్యాయవాదిపై దాడి దారుణం

కంబాలచెరువు: నందిగామలో న్యాయవాది ఎరగాని వీరబాబు, ఆయన కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆ ఘటనను నిరసిస్తూ అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సహ కార్యదర్శి బీర అరుణ్ కుమార్ అధ్యక్షతన రాష్ట్ర ప్రతినిధులు, న్యాయవాదులు శుక్రవారం రాజమహేంద్రవరం జిల్లా కోర్టు సమీపంలో నిరసన తెలిపారు. కేంద్రం తక్షణం న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని, నందిగామలో న్యాయవాది వీరబాబుపై జరిగిన దాడి దారుణమని నినాదాలు చేశారు. సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై దాడులు ఎక్కువయ్యాయని, ఇప్పటికైనా కేంద్రం స్పందించాలన్నారు. సీనియర్ న్యాయవాది దాసరి అమ్ములు మాట్లాడుతూ సమాజ పరిరక్షణకు పాటు



జిల్లా కోర్టు సమీపంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పడే న్యాయవాదులకు రక్షణ లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశి శ్రీనివాసరావు, సొసైటీ నాయకులు, న్యాయవాదులు కుంచె రాంబాబు, పి.లక్ష్మీనాగేశ్వరరావు, డాక్టర్ సత్యనారాయణ, సబ్బెళ్ల సోమిరెడ్డి, కళ్యాణ్ దొర, సజ్జ వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సిబ్బందికి పదోన్నతులు

రాజమహేంద్రవరం సిటీ: సీనియార్టీ, విద్యార్హతల ఆధారంగా నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పించి, ఖాళీలను భర్తీ చేస్తున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ గతంలో ఉద్యోగ విరమణతో ఖాళీ అయిన సూపరింటెండెంట్ పోస్టులో సీనియర్ అసిస్టెంట్ అయిన అల్లాడ రవి కుమార్‌ను, ఆయన పోస్టులో జూనియర్ అసిస్టెంట్ పి.రవికుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న ఐదు హెల్త్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి భర్తీ చేశామన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, మెస్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మొబైల్



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో కమిషనర్ కేతన్ గార్గ్

ఫాస్ట్‌ఫుడ్ వాహనాలలో ఆహార పదార్థాల తయారీ విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈనేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో తనిఖీలు చేపడుతున్నామన్నారు.

త్వరలో రోడ్ల పునరుద్ధరణ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నగరంలో దెబ్బతిన్న రోడ్లను త్వరితగతిన పునరుద్ధరిస్తామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. అలాగే డ్రైనేజీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత అధికారులు ప్రతి రోజూ తమ స్థాయిలో సమీక్ష చేసుకుని, ప్రాధాన్యతా క్రమంలో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు.

పుష్కరాల నాటికి రహదారుల అభివృద్ధి

కడియం: పుష్కరాల నాటికి నియోజకవర్గంలోని రోడ్లను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేశామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్షించారు. పలువురు సభ్యులు మండలంలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జేగురుపాడు పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీ వాసులు.. రైల్వే గేటు ఎప్పుడూ మూసే ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తెలిపారు. ఈ గేటు కారణంగా అక్కడ ఇళ్లు నిర్మించుకునేవారు మెటీరియల్ తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. రాకపోకలు సాగించేందుకు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి ఉం



రైల్వే గేటు సమస్యను తెలియజేస్తున్న జేగురుపాడు సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

దన్నారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. సమావేశం అనంతరం మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారం పొందిన టి.సత్యనారాయణ, జేఎన్ఎస్‌వీ ప్రసాద్, సబ్బి శ్రీనివాస్‌లను సత్కరించారు. అలాగే యూనియన్ బ్యాంకు సహకారంతో మహిళలకు ఇస్తున్న శిక్షణను



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

పరిశీలించారు. విజయవాడ వరద బాధితులకు కడియం మండలం నుంచి సేకరించిన విరాళాలను ఎమ్మెల్యేకు పలువురు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఎంపీడీవో కె.రత్నకుమారి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరయ్యారు.

సినీ గేయ సార్వభౌముడు ఆత్రేయ

సీటీఆర్ఐ: సినీగేయ సార్వభౌముడు ఆత్రేయ అని తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, తెలుగు సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్రేయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ మనిషికి మనసుకు ఉన్న అనుబంధాన్ని ఆత్రేయ చెప్పినంతగా మరి ఏకవి కూడా పేర్కొలేదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు మాట్లాడుతూ ఆయన కలం నుంచి వచ్చిన సంభాషణలన్నీ తాత్విక ధోరణితో ఉంటాయన్నారు. జీవిత తత్వాన్ని గుట్టువిప్పి, జీవితాన్ని కాసి వడపోసిన నగ్నసత్యాలేనని అన్నారు. అధ్యాపకుడు ఎస్.రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆయన అసలు పేరు కిళాంబి నరసింహాచార్యులు అని, పేరు



ఆత్రేయ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్ రాజబాబు తదితరులు

గోత్రాన్ని కలిపి ఆచార్య ఆత్రేయ అనే కలం పేరుతో ప్రసిద్ధి చెందారన్నారు. పల్లి సుధా మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాల సమస్యలను తీసుకొని మనోహరమైన నాటకాలుగా మలిచారని అన్నారు. టీసీవై రత్నం, విద్యార్థి పూర్వ సంఘ నాయకుడు చర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు.

27న యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సమ్మె



ధర్నా చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: బ్యాంక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన దేశ వ్యాప్తంగా యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు సమ్మె చేపట్టనున్నారని ఆ బ్యాంక్ ఆఫీసర్స్ సంఘ నాయకుడు లక్ష్మీపతిరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇన్నీసుపేటలోని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. లక్ష్మీపతిరావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. కొత్తగా నియామకాలు చేయకపోవడంతో ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు అందడం లేదని, ఉన్న ఉద్యోగులపై పనిభారం పడుతోందన్నారు. కొన్ని కార్పొరేట్ ఏజెన్సీల సలహాలను, సూచనలు తీసుకోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని, దీనివల్ల బ్యాంక్‌కు ఖాతాదారులు దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో విమెన్ కన్వీనర్ కేవీ స్వాతి, ప్రసాద్, రాజు, మురళీధర్, కిషోర్, ప్రకాష్, వంశీ పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం అందరికీ ఆదర్శప్రాయం

కంబాలచెరువు: మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమర యోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాల్లో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం టంగుటూరి అవార్డుల ప్రదానోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకొని పీజీసెట్ పరీక్ష రాసి ఒకటి నుంచి వందలోపు ఉన్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులకు టంగుటూరి పేరిట అవార్డులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రరావు ఆర్‌కే మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలకు పూర్వ విద్యార్థుల సంఘం నిరంతరం కవచం వలే రక్షణ చేస్తూ విద్యార్థుల భవితను తీర్చిదిద్దటానికి తోడుగా ఉంటోందన్నారు. ఉపాధ్యక్షుడు శ్రీరామమూర్తి మాట్లాడుతూ ర్యాంకులను సాధించిన విద్యార్థులకు శుభాశీస్సులు తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ముళ్ల మాధవ్ మాట్లాడుతూ టంగుటూరి తాను చదివిన ఆర్ట్స్ కళాశాలకు 47 ఎకరాలను అందించారన్నారు.

మంచి అలవాట్లు పెంపొందించుకోవాలి

కంబాలచెరువు: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి పాఠశాల విద్యాశాఖాధికారి వి.వెంకటరాజు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జాతీయ పౌష్టికాహార వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రమైన పోషకాహారాన్ని మాత్రమే భుజించాలన్నారు. జంక్ ఫుడ్‌కు సాధ్యమైనంత వరకూ దూరంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి నరసమ్మ మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంలో విద్యార్థులకు పోషకాహారం అందజేస్తున్నారన్నారు. పోషక విలువలు పెంచేందుకు కృత్రిమ విటమిన్లు, సప్లిమెంట్లు కలపడాన్నే పోర్టిఫైడ్ అంటారన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనత నిరోధించేందుకు పరీక్షలు జరిపి, అవసరమైన వారికి ఐరన్, ఫోలిక్ ఆసిడ్ మాత్రలు అందజేస్తున్నారన్నారు. మేజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ టీమ్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రియాంక మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పాఠశాల విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించడం, జీవన నైపుణ్యాలు పెంచడం నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, మేజిక్ బస్ యూత్ మెంటార్లు స్వాతి, స్వర్ణ, భువన, ఆశా వర్కర్ల సూపర్ వైజర్ భవాని, ఎస్‌కేవీటీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రైల్వే అధికారులతో సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ: పుష్కరాల సందర్భంగా రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో జరిగే అభివృద్ధి పనులపై శుక్రవారం విజయవాడలోని డివిజనల్ కాన్ఫరెన్స్ హాల్లో రైల్వే అధికారులతో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమీక్షించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, బ్రాంచ్ అధికారుల బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్ట్ పురోగతిని వివరించారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసేందుకు రైల్వే అధికారులతో కలిసి పనిచేయాలని ఎంపీ రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సూచించారు.

క్రెడాయ్ కృషి అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: గృహ నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక, సాంకేతిక నిర్మాణ పద్ధతులపై నిర్మాణ సారథులను, వినియోగదారులను ఒకే వేదిక పైకి తీసుకురావడం కోసం క్రెడాయ్ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని చెరుకూరి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన క్రెడాయ్ ఎక్స్‌పోను శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి ఆయన ప్రారంభించారు. క్రెడాయ్ గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎక్స్‌పోలో రాష్ట్రస్థాయి ఎంఎన్‌సీ నిర్మాణ కంపెనీలు ప్రదర్శనకు ఉన్నాయన్నారు. క్రెడాయ్ రాజమహేంద్రవరం చైర్మన్ సూరవరపు శ్రీనివాస కుమార్, అధ్యక్షుడు మన్యం ఫణికుమార్, ఉపా



క్రెడాయ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

ధ్యక్షుడు పూడి వెంకట శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ వెలుమూరి భీమశంకర్, వైస్ ప్రెసిడెంట్ మట్టపల్లి రంగ ప్రసాద్, జనరల్ సెక్రటరీ చల్లా బాలమురళీ కృష్ణ, ట్రెజరర్ టీవీ ఎల్ నరసింహారావు, జాయింట్ సెక్రటరీ జీవీవీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను కలిశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

రూ.2.60 లక్షల వితరణ

రాజమహేంద్రవరం రూరల్: టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ ఆధ్వర్యంలో బొమ్మూరు గ్రామపెద్దలు, వ్యాపారులు, టీడీపీ నేతలు, ప్రజలు రూ.2.60 లక్షలను విజయవాడ వరద బాధితులకు అందజేశారు. ఆ చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి మత్సేటి ప్రసాద్ తదితరులు అందించారు.

ఆరు పథకాలకు ప్రధాని మోదీ శ్రీకారం

రాజమహేంద్రవరం: కేంద్ర కేబినేట్ సమావేశంలో ఆరు పథకాలకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచార లోపంతో ఎంపీ పురందేశ్వరి అందుబాటులో ఉండటం లేదన్న వార్తను ఖండిస్తున్నానన్నారు. రాజమహేంద్రవరాన్ని వారసత్వ నగరంగా ప్రకటించాలని ఇప్పటికే పురందేశ్వరి పార్లమెంట్‌లో కోరారన్నారు.

విరాళాల అందజేత

కడియం: విజయవాడ వరద బాధితులకు కడియం మండలం నుంచి పలువురు విరాళాలను సమర్పించారు. జేగురుపాడు నుంచి రూ.3,33,999లను సీఎం సహాయ నిధికి అందజేశారు. పొట్టిలంక నుంచి రూ.75 వేలు, దామిరెడ్డిపల్లి నుంచి రూ.65 వేలు, కడియంలో వెలుగుబంటి యూత్, రైస్‌మిల్లర్స్ సమకూర్చిన రూ.2.75 లక్షలు, కడియం హైస్కూల్ విద్యార్థులను సేకరించిన రూ.23 వేలను శుక్రవారం ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరికి అందించారు.

ఎల్ఐసీ కొత్త పాలసీలు

రాజానగరం: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ప్రస్తుతం అందిస్తున్న జీవిత బీమా పాలసీల స్థానంలో అక్టోబర్ ఒకటి నుంచి కొత్త పాలసీలు వస్తాయని రాజమహేంద్రవరం రూరల్ బ్రాంచ్ మేనేజర్ డీఎస్‌వీ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన రాజానగరం క్లస్టర్ ఎల్ఐసీ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ ప్రీమియం, మంచి బోనస్ రేట్లతో కూడిన ప్రస్తుతం ఉన్న పాలసీలను పొందాలంటే ఈనెలాఖరు వరకే అవకాశం ఉందన్నారు. వచ్చే కొత్త పాలసీలలో ప్రీమియం పెరగడంతోపాటు అనేక మార్పులు వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసి, గడువు ముగిసేలోగా ప్రస్తుతం ఉన్న పాలసీలను విక్రయించడంలో ముందంజ వేయాలని ఏజెంట్లకు సూచించారు. ఇప్పటికే తీసుకున్న వారికి, నెలాఖరులోగా చేసిన వారికి ఈ పాలసీలకు సంబంధించిన అన్ని రకాల ప్రయోజనాలు కొనసాగుతాయన్నారు.